సాక్షి
కామారెడ్డి
సోమవారం। 22। జూలై। 2024



ఘనంగా గురుపౌర్ణమి

జిల్లాలో ఆదివారం గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

- 9లో ▸



పొంచి ఉన్న ప్రమాదం

వర్షాలు కురుస్తుండడంతో రామారెడ్డి మండలంలోని గంగమ్మ వాగులో వేసిన సర్వీస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
28.1 /21.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అడపాదడపా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

రుణం మాఫీ కాని రైతుల వివరాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, కామారెడ్డి: ప్రభుత్వం రూ. లక్షలోపు పంట రుణాలను మాఫీ చేయడంతో ఓవైపు రైతుల్లో హర్షం వ్యక్తమవుతుండగా.. మరోవైపు రుణమాఫీ కానివారిలో ఆందోళన నెలకొంది. దీనిపై 'సాక్షి'లో ఈ నెల 20వ తేదీన 'రుణ మాఫీ కొందరికేనా?!' శీర్షికన ప్రచురితమైన కథనంపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. ఆ రైతులకు ఎందుకు రుణం మాఫీ కాలేదన్న విషయంపై వివరాలు సేకరించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో వ్యవసాయ విస్తీర్ణాధికారులు రైతులతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నారు. రూ. లక్షలోపు పంట రుణం మాఫీ కాని వారు సోమవారం ఆయా బ్యాంకులకు సంబంధించిన ఫీల్డ్ ఆఫీసర్ల వద్దకు రావాలని సూచిస్తున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులు తమకు రుణాలు మాఫీ కాలేదని గగ్గోలు పెడుతున్నారు. చాలా మంది టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేస్తున్నారు. మరికొందరు వ్యవసాయ శాఖ అధికారులను కలిసి మొరపెట్టుకుంటున్నారు. సోమవారం జరిగే ప్రజావాణిలో రుణమాఫీ కాని రైతులకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయి.

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసిన షబ్బీర్ అలీ



కామారెడ్డి క్రైం : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ ఆదివారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెల్లెలికి పిల్లలు లేరని బాలుడి కిడ్నాప్

ఖలీల్‌వాడి: జీజీహెచ్‌లో మూడేళ్ల బాలుడి కిడ్నాప్ కేసులో కొత్త విషయం వెలుగు చూసింది. శనివారం తెల్లవారుజామున బాలుడి కిడ్నాప్ కాగా.. పోలీసులు సాయంత్రం వరకు కేసును ఛేదించిన విషయం తెలిసిందే. కేసులో నిందితులిద్దరిని ఆదివారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఒకరైన అద్నాన్ చెల్లెలికి పిల్లలు లేకపోవడంతో బాలుడిని ఎత్తుకెళ్లినట్లు వారు తెలిపారు. అద్నాన్ చెల్లెకు జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన ఓ వ్యక్తితో పెళ్లయ్యింది. వారికి పిల్లలు లేకపోవడంతో మానసికంగా ఆవేదన చెందడంతో బాలుడిని ఎత్తుకెళ్లి ఇద్దామనే ఆలోచన వచ్చింది. దీంతో తన స్నేహితుడు మొబిన్ సహకారంతో బాలుడిని అపహరించి తీసుకెళ్లి మెట్‌పల్లిలోని తన చెల్లెలుకు ఇచ్చారు.



జిల్లాకేంద్రంలో బోనమెత్తిన మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ

దోమకొండలో బోనాలతో మహంకాళి అమ్మవారి ఆలయం వద్దకు వస్తున్న భక్తులు

అమ్మకు ఆషాఢ బోనం

- దోమకొండలో ఘనంగా మహంకాళి బోనాలు
- భారీగా తరలివచ్చిన భక్తులు

దోమకొండ: మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటినుంచి తీసుకువచ్చిన బోనాలను మహంకాళి అమ్మవారికి సమర్పించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళలు శోభాయాత్రలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. నాలుగు వేల పైచిలుకు బోనాలను అమ్మవారికి సమర్పించినట్లు తెలుస్తోంది. ఘటం ఊరేగింపు, రంగం, భవిష్యవాణి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బోనాల పండుగను తిలకించడానికి దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి భక్తులు బంగారు వెండి వస్తువులు, డబ్బుల రూపంలో కానుకలు సమర్పించారు.

జిల్లాకేంద్రంలో..

కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. కాకతీయనగర్ కాలనీలో నిర్వహించిన ఉత్సవాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దోమకొండలోని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు పెద్దిరెడ్డి సిద్దారెడ్డి, పాలకుర్తి శేఖర్, మద్దూరి భూపాల్‌రెడ్డి, నార్ల వెంకటేశం, చిట్యాల రాజిరెడ్డి, చింతల రాజేష్, నర్రాగుల ఎల్లయ్య, ఆకంశెట్టి రాజయ్య, పన్యాల రవీందర్‌రెడ్డి, పూలబోయిన రమేష్, కూర నవీన్, తిప్పాపురం రవి, నిమ్మ బాల్‌రాజ్, నిమ్మ రాజనర్సు, నర్సారెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



కేవీఆర్‌ను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

డోంట్ కేర్..!

ఆ ఆస్పత్రుల్లో యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. కడుపులో ఆడపిల్ల పెరుగుతుందని తెలిస్తే తుంచేస్తారు. అధికారులను లెక్క చేయరు. కేసులు పెడితే రాజకీయ అండతో తప్పించుకుంటారు. చట్టంలోని లోసుగుల ఆధారంగా దందా నడుపుతూ రూ.కోట్లు సంపాదిస్తున్నారు.

కేసులకు జడవని ఆస్పత్రులు

- చట్టంలోని లొసుగులే వాళ్లకు బలం
- యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు
- అధికారుల మధ్య కొరవడిన సమన్వయం



సాక్షి, కామారెడ్డి : కడుపులో పెరుగుతున్న బిడ్డ ఆడా, మగా అని తేల్చడం చట్టవిరుద్ధం. అయినా సులువుగా డబ్బులు సంపాదించాలని కొందరు విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఆడపిల్లను భారంగా భావించే వారు కామారెడ్డి పట్టణానికి వచ్చి ఇక్కడి ఆస్పత్రుల్లో అడిగినన్ని డబ్బులు కట్టి స్కానింగ్ చేయించుకుంటున్నారు. కడుపులో పెరిగేది ఆడబిడ్డ అని తెలిస్తే చాలు అబార్షన్‌కు వెనకాడడం లేదు. ప్రజలు అవసరాన్ని ఆసరాగా చేసుకున్న కొన్ని ఆస్పత్రులు విచ్చలవిడిగా స్కానింగ్‌లు చేస్తూ అడ్డగోలుగా సంపాదిస్తున్నాయి. ఇటీవల జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్న సంఘటనలతో స్కానింగ్‌లు, అబార్షన్లే కాకుండా అప్పుడే పుట్టిన ఆడశిశువుల అమ్మకాలు జరుగుతున్నట్లు స్పష్టమైంది. ఈ వ్యవహారంలో పోలీసులు ఓ ఆస్పత్రిపై కేసులు నమోదు చేయగా, వైద్య, ఆరోగ్యశాఖ ఆస్పత్రిని సీజ్ చేసింది. దీనిపై కోర్టుకు వెళ్లిన సదరు ఆస్పత్రి యాజమాన్యం స్టే తెచ్చుకుంది. దీంతో సీజ్ చేసిన ఆస్పత్రి సీల్ తొలగించాల్సి వచ్చింది. పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ కేసులు నమోదు చేస్తున్నా జిల్లా కేంద్రంలో లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు ఆగడం లేదు. పైగా తమకు అడ్డే లేదన్న రీతిలో కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు మరింతగా రెచ్చిపోతున్నాయి.

రాజకీయ నేతల అండదండలు

భ్రూణహత్యలకు పాల్పడుతున్న వారికి రాజకీయ నాయకులు అండగా నిలుస్తుడడం మరింత దారుణం. లింగ నిర్ధారణ పరీక్షలు జరిపే వారిని వారించాల్సిన రాజకీయ నాయకులు వారికి అండగా నిలవడం విస్మయం కలిగిస్తోంది. నాయకులను మచ్చిక చేసుకుని తమపై కేసులు నమోదు కాకుండా, ఒక వేళ కేసులు నమోదైనా బలమైన సెక్షన్లు పెట్టకుండా చూసుకుంటున్నారు.

ఆగని అకృత్యాలు

జిల్లా కేంద్రంలో పోలీసు, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు కేసులు నమోదు చేసిన లింగ నిర్ధారణ పరీక్షలు ఆగడం లేదు. తెలంగాణ నలుమూలల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్ర నుంచి కూడా స్కానింగ్ కోసం ఆపై ఆడపిల్ల అంటే అబార్షన్లకు ప్రిపేర్ అయి ఇక్కడకు వస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ప్రభుత్వ యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో స్కానింగ్‌లు చేయడానికి వైద్యులు, ఆస్పత్రుల యాజమాన్యాలు భయపడుతున్నాయి. కామారెడ్డి జిల్లాలో అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో లింగ నిర్ధారణ పరీక్షలు నిరాటంకంగా నడుస్తున్నాయి. స్కానింగ్ కోసం వచ్చే వారిని ఓ చోట నిలిపివేసి, ఒక్కొక్కరినీ ఆస్పత్రికి తీసుకువచ్చి డబ్బులు కట్టించుకున్న తర్వాత స్కానింగ్ చేసి పంపడం ద్వారా అనుమానాలు రాకుండా ప్రయత్నిస్తున్నారు.

కలెక్టర్ దృష్టి సారిస్తేనే..

జిల్లా కేంద్రంలో జరుగుతున్న స్కానింగ్, అబార్షన్ల మాఫియాకు అడ్డుకట్ట వేయడానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నడుం బిగించాల్సిన అవసరం ఉంది. అధికారుల మధ్య సమన్వయం కుదిరించి చట్ట విరుద్ధంగా కొనసాగుతున్న స్కానింగ్‌లు, అబార్షన్లను కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సీజ్ చేసినా మారని తీరు

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం డాక్టర్‌కు, పరీక్షలు చేయించే కుటుంబ సభ్యులకు మూడేళ్ల జైలు శిక్ష, ఆపై జరిమానా కూడా విధిస్తారని చట్టం చెబుతోంది. మూడేళ్ల క్రితం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలోని కౌసల్య ఆస్పత్రిలో లింగనిర్ధారణ పరీక్షలతో పాటు భ్రూణహత్యలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు డెకాయ్ ఆపరేషన్ చేసి, ఆస్పత్రిని సీజ్‌చేశారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. తర్వాత కొంత కాలానికే కేసును పక్కన పెట్టేశారు. అదే ప్రాంతంలో ఓ కొత్త ఆస్పత్రిని ప్రారంభించి అక్కడ అదే దందాకు తెరలేపారు. గడిచిన రెండేళ్లుగా సదరు ఆస్పత్రిలో విచ్చలవిడిగా స్కానింగ్‌లు, అబార్షన్లు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. ఆడ శిశువు అమ్మకం వ్యవహారంలో బాలికల సంరక్షణ అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఆస్పత్రి యజమాని, డాక్టర్, సిబ్బందిని అరెస్టు చేశారు. దీనిపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సీరియస్‌గానే స్పందించి ఆస్పత్రిని సీజ్ చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. తమ ఆస్పత్రిలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నడవడం లేదని, అకారణంగా సీజ్ చేశారంటూ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై హైకోర్టు స్టే ఇస్తూ వెంటనే సీజ్ తొలగించాలని, సరైన ఆధారాలు ఉంటే నోటీసులు ఇచ్చిన తర్వాత సీజ్ చేయాలని ఆదేశించింది.

విజృంభించిన చికున్ గున్యా





చికిత్స పొందుతున్న జ్వర బాధితులు ప్రవీణ్, మంగళి లక్ష్మి

- బోర్లం క్యాంపులో పది మంది బాధితులు

బాన్సువాడ రూరల్ : బాన్సువాడ మండలం బోర్లం క్యాంపులో ప్రజలు విషజ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రజ్వరం, కీళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులతో అవస్థలు పడుతున్నారు. యువకులు, నడివయస్కులు సైతం కీళ్ల నొప్పులతో గోడలు, కర్రలు పట్టుకుని నడవాల్సి వస్తోంది. గ్రామంలోని పీఎంపీల వద్ద వైద్యం చేయించుకున్నా.. తగ్గక పోవడంతో బాన్సువాడకు పరుగులు పెడుతున్నారు. బాన్సువాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రక్తపరీక్షలు చేసుకోగా సుమారు 10 మందికి చికున్ గున్యా నిర్ధారణ అయింది. వైద్యుడి సూచన మేరకు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. స్థానికంగా నాణ్యమైన వైద్యం అందక బాధితులు రూ.వేలు ఖర్చు పెట్టి ప్రవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవా కార్యకర్త సంగం శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే గట్టుమీది గ్రామాలైన హన్మాజీపేట్, కోనాపూర్, కాద్లాపూర్, సంగోజీపేట్ గ్రామాల్లోనూ విషజ్వరాలు తగ్గుముఖం పట్టడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, పారిశుధ్య పనులు చేయించినా రోగుల సంఖ్య తగ్గడం లేదు.

నిండువానలోనూ నీళ్ల గోస!



భూగర్భ జలమట్టం పడిపోయి బోర్లు ఎత్తిపోవడంతో కామారెడ్డి పట్టణంలో నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. వర్షాకాలం మొదలై నెలన్నర దాటినా భారీ వర్షాలు కురవకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. ప్రస్తుతం రెండుమూడు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నా.. భూగర్భ జలాలు వృద్ధి చెందలేదు. దీంతో పట్టణవాసులకు ట్యాంకర్ నీరే దిక్కవుతోంది. ఆదివారం ఓవైపు వర్షం కురుస్తున్నా.. ట్యాంకర్ రావడంతో అశోక్‌నగర్ కాలనీవాసులు డ్రమ్ములు పెట్టి నీళ్లు పట్టుకున్నారు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– సాక్షి, కామారెడ్డి

దాశరథి జీవితం స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్సీ, ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న



నిజామాబాద్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో దాశరథికి నివాళులు అర్పిస్తున్న గోరటి వెంకన్న

నిజామాబాద్ అర్బన్ : మహాకవి దాశరథి కృష్ణమాచార్య జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ, ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న అన్నారు. దాశరథి 99వ జయంతి కార్యక్రమం ఆదివారం నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గోరటి వెంకన్న మాట్లాడుతూ.. దాశరథి కృష్ణమాచార్య నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. రజాకార్ల అకృత్యాలపై అనేక రచనలు చేశారని పేర్కొన్నారు. తన రచనల ద్వారా ఊరూరా తిరిగి ప్రజల్లో చైతన్యం రగిలించారన్నారు. ఉర్దూలో ఉన్న గాలిబ్ గజల్‌లను తెలుగులోకి అనువదించారని కొనియాడారు. ఆయన రాసిన 'ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానలమెంతో' గేయం ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. దాశరథి వందలాది సినిమాలకు పాటలు రాశారని గోరటి వెంకన్న గుర్తు చేశారు. తన రచనలకు ఎన్నో అవార్డులు అందుకున్న దాశరథి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆస్థాన కవిగా కూడా పనిచేశారని చెప్పారు. ప్రజల కష్టాలపై కవితలు, రచనలు చేయడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. అనంతరం కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జయంతి నిర్వహణ కమిటీ సభ్యులు కవి దారం గంగాధర్, దాసు, ఇందూరు సాయిబాబా, శ్రీనివాస్ ఆర్య, చంద్రశేఖర్, కళాకారులు అష్టగంగాధర్, ఆర్టీసీ శ్రీనివాస్, లయోల సాయిలు, సురేష్ బాబు, అబ్దుల్, ఎస్ రంజిత్, కామినేని రేణుక తదితరులు పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు

- జిల్లా అంతటా మోస్తరు వర్షం
- పారుతున్న వాగులు
- సాగుకు అనుకూలంగా వాతావరణం



శేర్‌ఖాన్‌పల్లి వాగు మత్తడి పైనుంచి ప్రవహిస్తున్న నీరు

సాక్షి, కామారెడ్డి : మూడు రోజులుగా కురుస్తున్న జల్లులతో జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. జిల్లా అంతటా శని, ఆదివారాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. నస్రుల్లాబాద్‌లో అత్యధికంగా 6.4 సెం.మీ. వర్షాపాతం నమోదైంది. దాదాపు జిల్లా అంతటా వర్షం కురిసింది. ఆదివారం మధ్యాహ్నం కొంత తెరిపి ఇచ్చినా, సాయంత్రం నుంచి తిరిగి జల్లులు కురిశాయి. రాత్రి కూడా వర్షం కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చిన్నచిన్న ఒర్రెల్లో నీటి ప్రవాహం మొదలైంది. తెరిపిలేకుండా కురుస్తున్న జల్లులతో వరి నాట్లకు వాతావరణం అనుకూలంగా మారింది. వర్షాలు లేక నాట్లు వేయలేకపోయిన రైతులు వర్షపు నీటితో పొలాలను సిద్ధం చేసి నాట్లు వేస్తున్నారు.

అలుగు పారుతున్న చెరువులు

నిజాంసాగర్(జుక్కల్) : రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో ఒర్రెలు, వాగుల్లో ప్రవాహాలు ప్రారంభం అయ్యాయి. వర్ని, బాన్సువాడ, గాంధారి, నిజాంసాగర్ మండలాల్లో కురుస్తున్న వర్షాలకు మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం పెద్ద మత్తడితో పాటు శేర్‌ఖాన్‌పల్లి వాగు మత్తడి పొంగిపొర్లుతున్నాయి. సింగితం రిజర్వాయర్‌లోకి ఆదివారం వేకువజాము నుంచి 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 417.20 మీటర్లు కాగా ఆదివారం సాయంత్రానికి 412 మీటర్లకు చేరింది.

నిజాంసాగర్‌లోకి 385 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం ఉదయం 385 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1,387.52 అడుగుల(3.13 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

జిల్లాలో వర్షపాతం వివరాలు

మండలం	మి.మీ.	మండలం	మి.మీ.
నస్రుల్లాబాద్	64.0	నాగిరెడ్డిపేట	36.2
బాన్సువాడ	60.6	తాడ్వాయి	35.9
బీర్కూర్	55.8	లింగంపేట	34.9
ఎల్లారెడ్డి	53.0	రామారెడ్డి	34.2
బిచ్కుంద	48.5	కామారెడ్డి	29.8
జుక్కల్	48.1	సదాశివనగర్	29.7
పెద్దకొడప్‌గల్	47.8	భిక్కనూరు	29.3
గాంధారి	46.9	మాచారెడ్డి	28.2
డోంగ్లీ	45.8	పల్వంచ	27.8
పిట్లం	44.6	రాజంపేట	26.3
నిజాంసాగర్	43.2	దోమకొండ	20.7
మద్నూర్	42.5	బీబీపేట	18.0



వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న సింగీతం

వర్షానికి కూలిన పెంకుటిల్లు

లింగంపేట : మండలంలోని బోనాల్ తండాకు చెందిన జగ్యానాయక్ ఇల్లు వర్షానికి ఆదివారం కూలినట్లు తండా వాసులు తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న ముసురుకు పెంకుటిళ్లు కూలిపోయినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.



బోనాల్ తండాలో కూలిన ఇల్లు



నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

క్లుప్తంగా

విద్యార్థుల రక్షణ కోసం సోలార్ ఫెన్సింగ్



బీబీపేట: అడవుల్లో ఉండాల్సిన కోతులు గ్రామాల్లోకి చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో విపరీతంగా కోతులు ఉండడం వాటి దాడిలో ఇప్పటికే పలువురు గాయపడడం లాంటి సంఘటనలు జరిగాయి. అంతే కాకుండా పాఠశాలల్లో దూరి విద్యార్థులపై దాడులు చేయడంతో టీఎస్ఎన్ఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పునర్నిర్మాణ దాత అయినటువంటి తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి పాఠశాల ప్రహరీ చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ముందుకొచ్చారు. కోతుల దాడిలో విద్యార్థులు గాయపడడం, వస్తువులను చిందరవందరగా చేయడంతో పాఠశాల హెచ్ఎం రవీంద్రరెడ్డి సుభాష్ రెడ్డి దృష్టికి తీసుకుపోయారు. దీంతో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో కోతుల నుంచి విద్యార్థులకు ముప్పు తప్పినట్లవుతుంది.

గుంతలమయంగా రోడ్డు



రాజంపేట : రాజంపేట నుంచి గుండారం వెళ్లే రోడ్డు మార్గంలో పలు గ్రామాల శివార్లలో రోడ్డు గుంతలమయంగా మారాయి. బస్వన్నపల్లి, ఆర్గొండ, కొండాపూర్ గ్రామాలకు వెళ్లే పలు ప్రాంతాలలోని రోడ్లు గంతలమయంగా మారడంతో వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఎండాకాలంలో ఆర్అండ్‌బీ రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చడానికి సన్నాహాలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు.

ఘనంగా నవదుర్గ వ్రతం



కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని శ్రీశారదా మాత ఆదిశంకర ఆలయంలో ఆదివారం గురు పూర్ణిమను ఘనంగా నిర్వహించారు. శ్రీనవ దుర్గ వ్రతం, జగద్గురువు ఆదిశంకరాచార్యులకు అభిషేకం చేశారు. అలాగే ఆర్‌బీ నగర్‌లోని ఇష్టకార్యసిద్ధి హనుమాన్ ఆలయంలో జగద్గురువు ఆదిశంకరాచార్యుల విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీల ప్రతినిధులు బాలకిషన్, సత్యనారాయణగౌడ్, నిత్యనందం, మహిపాల్‌రెడ్డి, అర్చకులు సతీష్‌పాండే, సూర్యకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి జాతర



దోమకొండలో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

- దోమకొండలో భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు
- పట్టణంలో ప్రత్యేక పూజలు చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్



మైసమ్మ ఆలయంలో చైర్‌పర్సన్ ఇందుప్రియ పూజలు



పోతరాజుల విన్యాసం



బోనాలతో మహిళలు

కామారెడ్డి రూరల్/దోమకొండ : జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో ఆయా కాలనీవాసులు ఆషాఢ మాస బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. కామారెడ్డి పట్టణంలో అశోక్‌నగర్‌లోని యాదవ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల వేషధారణ ఆకట్టుకుంది. మున్నూరుకాపు సంఘం, రాజానగర్ లోని పోచమ్మ దేవాలయం(19వ వార్డు), స్నేహపురి కాలనీలోని మైసమ్మ దేవాలయం (17వ వార్డు), రుక్మిణి కుంటలోని కట్ట మైసమ్మ దేవాలయం (39, 40వ వార్డు) ఆలయాల్లో ఆయా కాలనీ వాసులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. 14వ వార్డు కాకతీయ నగర్ కాలనీ మూడో వీధిలో ఆదివారం బోనాలు ఊరేగించారు. ఈ బోనాల ఉత్సవాలకు కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చైర్మన్ బోనమెత్తుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మైసమ్మ తల్లిని వేడుకుంటున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోకు 40 మంది ఎంపిక



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు 40మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని మాధవనగర్‌లో ఉన్న బీఎల్ఎస్ గార్డెన్‌లో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ఆదివారం తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాజిరెడ్డి జగన్, ప్రధాన కార్యదర్శి, కోచ్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో పర్యవేక్షణలో నిర్వహించారు. మొత్తం 70 మంది క్రీడాకారులు పాల్గొనగా 40 మంది గోల్డ్ మెడల్, 20మంది సిల్వర్, 10 మంది బ్రాంజ్ మెడల్స్ సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులు ఈ నెల 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయికి పోటీల్లో పాల్గొంటారనని కోచ్ మనోజ్ తెలిపారు. రెఫరీలుగా నేహ, గయాజ్ వ్యవహరించగా, అసోసియేషన్ కోశాధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్

కామారెడ్డి అర్బన్ : సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో చేతితో పెయింటింగ్ చేసే చిత్రకారులకు ఉపాధి లేకుండా పోయిందని పెయింటింగ్ తెలంగాణ ఆర్టిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ అన్నారు. ఆదివారం పెయింటింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా శాఖ సమావేశం స్థానిక గంజ్ ధర్మశాలలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు చిత్రకళకారులు ఉపాధిలేక కొట్టుమిట్టాడుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కే.రమేష్, గౌరవ అధ్యక్షుడుగా సయ్యద్ తహీర్, ఉపాధ్యక్షుడుగా ఎం.రాము, కారదర్శిగా రవి, సహాయ కార్యదర్శిగా పి.లక్ష్మన్, కోశాధికారిగా ఎం.రాజు, సలహాదారుగా ఎన్.శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు.

విద్యుత్ అధికారుల విచిత్ర ధోరణి

- నకిలీ సర్టిఫికెట్లు పెట్టిన ఆర్టిజన్‌పై చర్యలు కరువు
- ఎఫ్ఐఆర్ లేదు.. రికవరీ చేయలేదు
- ఆర్మూర్ డివిజన్‌లో ఇష్టారాజ్యం

నిజామాబాద్‌నాగారం: జిల్లా విద్యుత్ శాఖ అధికారులు విచిత్ర ధోరణిని అవలంబిస్తున్నారు. సబ్‌స్టేషన్‌లలో గతంలో కాంట్రాక్టర్ ద్వారా ఐటీఐ(ఎలక్ట్రిషియన్) చేసిన వారికి ఆపరేటర్లుగా ఉద్యోగాలు కల్పించి వారి ద్వారానే వేతనాలు చెల్లించేవారు. అయితే, 2017లో ఆపరేటర్లను ఆర్టిజన్లుగా మార్చి విద్యుత్‌శాఖలో విలీనం చేసి జీతాలు పెంచిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో ఎవరైనా ఫేక్ సర్టిఫికెట్లతో విధుల్లో చేరినట్లు తెలిసినా, పట్టుబడినా వారిపై సంబంధిత డివిజన్ ఇంజనీర్లు క్రిమినల్ కేసులు నమోదు చేసి రికవరీ చేయాలని ఎఫ్ నంబర్ 3021–ఆదేశాలు జారీ చేశారు. ఆపరేటర్లను విద్యుత్‌శాఖలో విలీనం చేస్తూ ఉత్తర్వులు వెలువడిన తరువాత ఆర్మూర్ డివిజన్‌లో 156మంది ఆర్టిజన్ల ఐటీఐ సర్టిఫికెట్లను పరిశీలన కోసం హైదరాబాద్‌లోని ఎంప్లాయిమెంట్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్‌కు పంపించారు.

సర్టిఫికెట్లను పరిశీలించిన అధికారులు కమ్మర్‌పల్లి మండలం మానాల సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్టర్ ద్వారా ఉద్యోగంలో చేరిన గుగ్లోత్ మదన్‌లాల్‌ది ఫేక్ సర్టిఫికెట్ అని 2023 ఏప్రిల్‌లో తేల్చారు. అయినప్పటికీ సదరు ఆర్టిజన్ సుమారు ఏడాదిపాటు విధులు నిర్వర్తిస్తూ ప్రతి నెలా సుమారు రూ.30వేలకు పైగా జీతం తీసుకున్నారు. కార్యాలయ ఉద్యోగులు డీఈపై ఒత్తిడి తీసుకురాగా 'నేను చూసుకుంటా.. ఎస్ఈకి లేఖ రాశా' అని చెప్పి తీరా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి విధులకు రావొద్దని ఆర్టిజన్‌ను డీఈ హరిచంద్‌నాయక్ ఆదేశించి విధుల నుంచి తొలగించి చేతులుదులుపుకున్నారు. ఆర్టిజన్ ఫేక్‌సర్టిఫికెట్లతో ఉద్యోగం చేశాడని తేలినా డీఈ ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, దానికి కిందిస్థాయి ఉద్యోగులను బాధ్యులను చేసే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అ'పూర్వ' సమ్మేళనాలు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు



మాట్లాడుతున్న ఇంటెలిజెన్స్ ఎస్పీ రతన్‌కుమార్

ఎల్లారెడ్డి/బాన్సువాడ/మాచారెడ్డి: పూర్వ విద్యార్థుల సమ్మేళనాలను ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాలతోపాటు మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని వీకేవీ కన్వెన్షన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల (1982–84 బ్యాచ్) ఇంటర్మీడియెట్ పూర్వ విద్యార్థులు, బాన్సువాడ పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో (2003–04బ్యాచ్) పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేశారు. ఎల్లారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ ఇంటెలిజెన్స్ ఎస్పీ రంజన్‌రతన్‌కుమార్ హాజరై మాట్లాడారు. 40 ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులైన అడిషనల్ ఎస్పీ సంజీవరావు, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, వర్ని, ఇందల్వాయి ఎంపీడీవోలు వెంకటేశం, అనంత్‌రావు, జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ బీఎల్ శంకర్, రిజిస్ట్రార్ రవీందర్‌నాయక్ (కూకట్‌పల్లి), రాజ్‌కుమార్, రాజేందర్ నాథ్, మర్మల్ల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడలో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమ్య, శృతి, అర్చన, గౌతమి, శిరీషా, పద్మ, నిఖిల, రాజేశ్, అభినయ్, నాగార్జున, శివ కుమార్, రాకేశ్, ఉపాధ్యాయులు సుదర్శన్, అనూష, హన్మండ్లు, రమేశ్, సుంకి విజయలక్ష్మి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. చుక్కాపూర్‌ఉన్నత పాఠశాలలో 1987–88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అశోక్‌కుమార్, నరసింహారెడ్డి, కృష్ణ కుమార్, రఘుపతి, సత్యం, మంజుల, రమణ ఉన్నారు.



బాన్సువాడలోని సరస్వతి శిశుమందిర్‌లో..



చుక్కాపూర్ ఉన్నత పాఠశాలలో..

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు



అయ్యప్ప, అన్నప్రసాద్ సేవా సమితి సభ్యులకు..

కామారెడ్డి క్రైం : ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కామారెడ్డిలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో సన్మానించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె రాజవర్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిపోయిన పోస్టులకు కూడా పదోన్నతులు చేపట్టాలని కోరారు. అంగన్‌వాడీల్లో 3వ తరగతి వరకు అనే ఆలోచన విరమించికోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, గౌరవ అధ్యక్షుడు బాబు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు నర్సింలు, నాంపల్లి, గోపాల్, భారతిబాయి, బాల నర్సయ్య, బ్రహ్మానందం, సత్తయ్య, బాలయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ సిండికేట్ ఆధ్వర్యంలో..

కామారెడ్డి రూరల్ : పట్టణంలోని మణికంఠ ఎంప్లాయిస్ యూనియన్ సిండికేట్ ఆధ్వర్యంలో అయ్యప్ప సేవా సంఘం మరియు అన్న ప్రసాద్ సేవా సమితి నూతనంగా ఎన్నుకోబడ్డ అధ్యక్ష కార్యదర్శులకు సన్మానం చేశారు. అధ్యక్షుడు నస్కంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోనే శ్రీనివాస్, కార్యనిర్వహక అధ్యక్షుడు పట్టణం రమేష్, కోశాధికారి సోమిశెట్టి నారాయణ, అయ్యప్ప అన్న ప్రసాద్ సేవా సమితి అధ్యక్షుడు మానస రాజు, కార్యదర్శులు రఘు కుమార్, మోత్కూరు శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. మణికంఠ ఎంప్లాయిస్ యూనియన్ సిండికేట్ సభ్యులు దాస్ గోవర్ధన్, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మానసికస్థితి సరిగా లేక యువతి ఆత్మహత్య

మాక్లూర్: మానసికస్థితి సరిగా లేని యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మానిక్‌బండార్ తండాల్లో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్సై గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మానిక్‌బండార్ తండాకు చెందిన బదావత్ అమర్‌సింగ్‌కు ముగ్గురు ఆడ పిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె వివాహం కాగా, రెండో కుమార్తె గతంలో మృతి మృతి చెందింది. మూడో కుమార్తె అయిన దివ్య(20) మానసిక స్థితి సరిగా లేకపోవడంతో నిజామాబాద్‌లోని స్నేహ సొసైటీలో చేర్పించగా, అక్కడ ఉండలేని ఇంటికి వచ్చేసింది. కంటి చూపు సైతం సరిగా లేని దివ్యం ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తండ్రి బదావత్ అమర్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జల్దిపల్లి గ్రామ శివారులో ఆదివారం విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన తిగుల హన్మంతు రోజులాగే గ్రామ శివారులోకి గేదెను మేతకు తీసుకెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్ తగిలి మృతి చెందిందన్నారు. మృతి చెందిన గేదె విలువ రూ.50వేలు ఉంటుందని, విద్యుత్ అధికారులు తనకు పరిహారం చెల్లించాలని బాధితుడు కోరాడు.

మొబైల్ దుకాణంలో చోరీకి యత్నం

కామారెడ్డి క్రైం: పట్టణంలోని సాందీపని జూనియర్ కళాశాల పక్కన ఉన్న హైమద్ మొబైల్ షాపులో దుండగులు శనివారం అర్ధరాత్రి చోరీకి యత్నించారు. షటర్ తాళాలు పగులగొట్టేందుకు దుండగులు విఫల యత్నం చేశారు. ఆదివారం ఉదయం దుకాణానికి వచ్చిన యజమాని నజీర్ హైమద్ తాళాలు ధ్వంసమై ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. మొబైల్ షాపు నుంచి ఎలాంటి సొత్తు చోరీకి గురికాలేదని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు చోట్ల చేపల వేటకు వెళ్లి ఇద్దరి మృతి



అన్వర్ మృతదేహం

ఖలీల్‌వాడి: చేపల వేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందిన ఘటన నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. 80 క్వార్టర్స్ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు అన్వర్ అనే యువకుడు ఆదివారం ఉదయం వెళ్లాడు. చేపలను వేటాడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలోపడి మునిగిపోయాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వారు రెస్క్యూటీమ్‌ను రప్పించారు. రంగంలోకి దిగిన రెస్క్యూటీమ్ అన్వర్ మృతదేహాన్ని నీటిలో నుంచి బయటికి తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సుర్బిర్యాల్‌లో..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామానికి చెందిన పల్లికొండ లక్ష్మణ్(29) చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకుని మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్మూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి టీవీటీ విభాగంలో క్లీనింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న లక్ష్మణ్ శుక్రవారం విధులు ముగించుకుని గ్రామానికి వెళ్లాడు. అదే రోజు రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లిన లక్ష్మణ్ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. అయితే, ఆదివారం ఉదయం.. గ్రామ చెరువులో లక్ష్మణ్ శవమై కనిపించాడు. చేపలు వేటాడే సమయంలో వలలో చిక్కుకుని లక్ష్మణ్ మృతి చెందాడు. ఆర్మూర్ ఎస్సై అంజమ్మ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి భూదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక..

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాదికి చెందిన గాంధారి రహిత (15) గత నెల 17న పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం సాయంత్రం మృతి చెందింది. తన కూతురి మృతిపై ఎలాంటి అనుమానం లేదని, కడుపునొప్పి భరించలేక క్రిమి సంహారక మందు తాగిందని మృతురాలి తండ్రి వెంకటేశ్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు.

లిఫ్ట్ గుంతలో పడి మహిళ..



రాజేశ్వరి మృతదేహం

కామారెడ్డి క్రైం: లిఫ్ట్ కోసం తవ్విన గుంతలో పడి మహిళ మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పాల్వంచ మండలం మంథని దేవునిపల్లి గ్రామానికి చెందిన కామటి భూమయ్య, రాజేశ్వరి (55) దంపతులు కొద్ది రోజులుగా కామారెడ్డి లోని తాహెర్ గార్డెన్ వెనుక ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న భవనంలో వాచ్‌మెన్‌గా పని చేస్తూ అదే భవనంలోని మూడో అంతస్తులో ఉంటున్నారు. శనివారం రాత్రి 10.30 గంటలకు భోజనం చేసిన రాజేశ్వరి చేతులు కడుక్కోడానికి వెళ్లి భవనం పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడింది. ఆమె లిఫ్ట్ గుంతలో పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే భర్త భూమయ్యతోపాటు బంధువులు రాజేశ్వరిని బయటికి తీసినప్పటికీ ఆమె మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు..



లక్ష్మణ్ గోండ (ఫైల్)

మద్నూర్(జుక్కల్): రుణమాఫీ వచ్చిందో లేదో తెలుసుకునేందుకు బ్యాంకు వెళ్లిన వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇన్‌చార్జి ఎస్సై సాయన్న, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. డోంగ్లీ మండలంలోని మొగా గ్రామానికి చెందిన లక్ష్మణ్ గోండ(60) రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు శనివారం ఉదయం మేనూర్‌లోని సిండికేట్ బ్యాంకుకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం లక్ష్మణ్ గోండ ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆదివారం సలాబత్‌పూర్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి చూసి లక్ష్మణ్‌గోండ మృతదేహంగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. లక్ష్మణ్ గోండ ఒంటిపై గాయాలున్నాయని, మేనూర్‌కు వెళ్తానని సలాబత్‌పూర్‌కు ఎందుకు వెళ్లాడని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 10 మందిని అరెస్టు చేశారు. న్యాల్‌కల్ రోడ్డులోని లలితానగర్ ఫేస్–2లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఏసీపీ విష్ణుమూర్తి ఆదేశాల మేరకు సీఐ పురుషోత్తం సిబ్బందితో కలిసి దాడి చేశారు. 10 మందిని అదుపులోకి తీసుకొని రూ.5,200 నగదుతోపాటు 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ముగ్గురి అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం గూడెం గ్రామానికి చెందిన తల్లీకూతుళ్లు అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు ఆదివారం తెలిపారు. భర్తతో గొడవల కారణంగా బీబీపేట మండలం ఇస్సానగర్‌కు చెందిన నల్లకుంట స్వరూప, కుమార్తె తేజస్వితో కలిసి మూడు నెలలుగా కామారెడ్డి మండలం గూడెంలోని తల్లిగారింటి వద్ద ఉంటోంది. మూడు రోజుల క్రితం స్వరూప తన కూతురితో కలిసి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోగా, కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పట్టణానికి చెందిన యువతి..

కామారెడ్డి పట్టణంలోని కాకతీయనగర్ కాలనీకి చెందిన కలిగుట సౌజన్య అనే యువతి అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. మండలంలోని షాబ్దిపూర్ గ్రామానికి చెందిన నర్సింలు కుటుంబం కొద్ది రోజులుగా కామారెడ్డిలో నివాసం ఉంటుండగా, ఆయన కుమార్తె సౌజన్య ఈ నెల 20న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి నర్సింలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జీజీహెచ్ నుంచి వృద్ధురాలు..

ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బాల్కొండకు చెందిన గ్రామానికి చెందిన సకినా (60) అదృశ్యమైనట్లు ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. గర్భవతి అయిన తన కూతురిని డెలివరీ కోసం సకినా ఈనెల 2న జీజీహెచ్‌లో అడ్మిట్ చేసింది. 4వ తేదీన సాయంత్రం టీ తీసుకువస్తానని బయటికి వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేజీబీవీకి భారీగా దరఖాస్తులు

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ శివారులో ఉన్న కేజీబీవీలో వంట పని, గదులు శుభ్రపరిచే పనులకు భారీగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 50 మందికి పైగా మంది దరఖాస్తు చేసుకోవడంతో పోటీ నెలకొంది. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సు 61 ఏళ్ల నిబంధన ఉండడంతో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారికి అదే నిబంధనను అమలు చేస్తున్నారు. దీంతో ఇక్కడి కేజీబీవీలో హెడ్ కుక్, ఇద్దరు అసిస్టెంట్ కుక్‌లు, ఒక స్వీపర్ పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. వీరి స్థానంలో కొత్తవారిని నియమించడానికి ఈనెల 18 నుంచి 20 వరకు దరఖాస్తులు స్వీకరించారు.